

ఎంపీ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న ఆనంద్‌గౌడ్

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు సత్కారం

అంబర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ సత్కరించారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితుడైన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ లక్ష్మణ్‌ను న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వరప్ప, సురేష్ ఉన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శనివారం స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, జలమండలి అధికారులతో పర్యటించి పరిశీలించారు. వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి, జలమండలి ఏఈ మాజీద్, సూపర్‌వైజర్ లక్ష్మణ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపికైన హైకోర్టు న్యాయవాది



ఎట్టయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాది, సంఘసేవకులు జి.ఎట్టయ్యకు మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపికయ్యారని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. శనివారం కాచిగూడలోని కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అంతర్జాతీయ అహింసా దినోత్సవం ముగింపు వేడుకల సందర్భంగా ఈ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన మంత్రి పీఎస్

చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పర్సనల్ కార్యదర్శి సోమరాజు కుటుంబసమేతంగా శనివారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో కె రామాంజనేయులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఉపప్రధాన అర్చకులు నారాయణచారి సోమరాజు కుటుంబసభ్యులను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

వీసీ నియామకాలలో మాలలకు తీరని అన్యాయం: బల్వంత్‌రావు

నల్లకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :నాటి తెలుగుదేశం పార్టీ తర్వాత బీఆర్ఎస్ నుంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు వీసీ నియామకాలలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు ఆరోపించారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

బీసీలకు అన్యాయం

బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వీసీల నియామకాలలో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ఆరోపించారు. మరో మూడు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకం త్వరలో జరగనున్నదని, వాటికీ బీసీలనే నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 54 శాతం జనాభా ఉన్న బీసీలకు ప్రభుత్వం 9 వీసీలలో కేవలం మూడు మాత్రమే కేటాయించిందని ఆరోపించారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వట్టిపల్లిలో నివాసం ఉంటున్న సయ్యద్ ముక్తార్ (51) ఈనెల 17న కందికల్ గేట్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది, ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడిన బ్యాగు

రైలు ప్రయాణికుడు బోగిలోని ఒక గేట్ వద్ద బ్యాగ్ పెట్టి మరో గేటు వద్ద నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా ఆ బ్యాగు రైలు నుంచి జారి కిందపడిపోయింది.

ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. మలక్‌పేటకు చెందిన అన్వర్ పాషా (50), బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి వస్తుండగా మలక్‌పేటలో దిగడానికి కుటుంబసభ్యులకు ఫోన్ చేశాడు. రైలు ఫలక్‌నామా వద్దకు రాగానే బోగిలోని వేరే డోర్ వద్ద తన బ్యాగును ఉంచి పక్క డోరు వద్ద ఫోన్ మాట్లాడుతుండగా బ్యాగు కిందపడిపోయింది. అందులో ల్యాప్‌ట్యాప్, దుస్తులు, కార్డులు ఉన్నాయి. శనివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఎల్లప్ప కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షలు ఆపేయాలంటూ నిరసనలు

- నినాదాల మధ్య బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం
- బీజేపీ మహిళా నేతల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ నేత ప్రవీణ్
- పరామర్శించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్



బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



మహిళల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ భోలక్‌పూర్ మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడిపై బీజేపీ మహిళా నేతలు దాడి చేశారు. శనివారం గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా ముషీరాబాద్ నుంచి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు లోయర్ ట్యాంక్‌బండ్ వరకు తరలి వెళ్లారు. అందులో భాగంగా భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్ గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేస్తుండగా అదే క్రమంలో అక్కడే ఉన్న బీజేపీ మహిళా నేతలు సైతం నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రవీణ్ పై బీజేపీ మహిళా నేతలు దాడి చేశారు. దాడిలో ప్రవీణ్ షర్టు చినిగిపోగా వంటిపై గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ప్రవీణ్‌ను అక్కడి నుంచి దోమలగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రవీణ్‌ను పరామర్శించి దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే వెంట భోలక్‌పూర్, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ రావు, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, పార్టీసీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, పి.శ్రీధర్‌చారి, జావిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రవీణ్‌ను స్టేషన్‌నుంచి ఇంటికి తీసుకెళ్లారు.

జీవో 29 రద్దు కోసం పోరాడతాం

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా విడుదల చేసిన జీవో 29ని రద్దు చేసేంత వరకు పోరాటం నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు డాక్టర్ అనూహ్యారెడ్డి హెచ్చరించారు. శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని, ఎస్సీ ఎస్టీ, బీసీ గ్రూప్ 1 అభ్యర్థులు జీవో 29 వల్ల రిజర్వేషన్‌లు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ముషీరాబాద్ ఫుట్‌పాత్‌లపై షాపుల కూల్చివేత

- ఆందోళన వ్యక్తం చేస్తున్న చిరువ్యాపారులు
- అధికారులతో వాగ్వాదం
- ఉపేక్షించేది లేదన్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ రాంశెట్టి



ముషీరాబాద్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తదితరులు

ముషీరాబాద్, రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్ నుంచి ముషీరాబాద్ చౌరస్తా వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న షాపులను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నపలంగా కూల్చివేయడంపై ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే చిరువ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఫుట్‌పాత్‌పై ఉన్న డబ్బాలు, షెడ్డులు, దిమ్మెలను తొలగించారు. దీంతో కొద్ది సేపు చిరువ్యాపారులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్‌లకు ఫిర్యాదు చేయడంతో వారు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చిరువ్యాపారులు పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకుంటున్నారని వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. అయినా సిబ్బంది కూల్చివేతలను కొనసాగించారు. కూల్చివేతల్లో మెకానిక్ షాపు, టీకొట్టు, పేపర్ దుకాణం, భోజనం విక్రయించే షెడ్డు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు దాదాపు 10 ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదాచారులకు ఇబ్బందికలిగించే వారిని ఉపేక్షించేది లేదని జీహెచ్ఎంసీ సర్కిల్- 15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ రాంశెట్టి హెచ్చరించారు.

ఎలా బతకాలి

- మోహన్, ఫుట్‌పాత్ రెగ్జిన్ వర్కర్



29ఏళ్ళుగా ఫుట్‌పాత్‌పై రెగ్జిన్ వర్క్, సోఫా రిపేరింగ్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాం. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారు. తమ జీవనోపాధిని తొలగిస్తే ఎలా బతకాలి.

సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్



సదస్సులో మాట్లాడుతున్న సుధా నాగేందర్

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ తెలిపారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్, లా కమిషన్‌లు గతంలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయని అన్నారు. హైదరాబాద్ అన్ని విధాలుగా అనుకూలమని ఏపీతో పాటు కర్నాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్రలకు అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలో జేఏసీ తరపున ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, న్యాయశాఖ మంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధనకు సంతకాల సేకరణ, అన్ని పార్టీల ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయవాది ఉపాధ్యాయ, హైకోర్టు న్యాయవాదులు చల్లా రాంచంద్రారెడ్డి, రాంకిషోర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డోర్ టూ డోర్ ఎస్సీ, ఎస్టీ కులగణన సర్వే చేయాలి

- వర్గీకరణ వ్యతిరేక పోరాట నేతల డిమాండ్



రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అమిత్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న మన్నె శ్రీధర్‌రావు, బల్వంత్‌రావు

నల్లకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : 1950 నాటి ఉత్తర్వులకు విరుద్ధంగా రాజ్యాంగంలోని 341, 342 ఆర్టికల్ సవరించకుండా 338 ఆర్టికల్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంపీరియల్ డేటా తీసుకోకుండా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సరికాదని వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కన్వీనర్ మన్నె శ్రీధర్‌రావు, జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావులు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011 కులగణన లెక్కలు తీసుకోకూడదని ప్రస్తుతం 2024 నుంచి ఎస్సీ, ఎస్టీ కులగణన డోర్ టూ డోర్ సర్వే చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో శనివారం నగరంలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో శాఖ డిప్యూటీ డైరెక్టర్ అమిత్ యాదవ్‌ను కలిసి 26 అంశాలతో కూడిన వినతి పత్రం సమర్పించామని వారు తెలిపారు. అనంతరం హైదర్‌గూడలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ కుల గణన విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాలలో ఎవరి వాటా ఎంత అని తేల్చకుండా ఉంటే ఇప్పటి వరకు అన్ని రకాల రిజర్వేషన్ ఫలాలు అందుకున్న వారే తిరిగి అందుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కో-కన్వీనర్లు జి.కల్యాణ్‌రావు, ప్రవీణ్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం పథకానికి నిధులు కేటాయించాలి

- మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య



మాట్లాడుతున్న తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య

రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ అభయ హస్తం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అభయ హస్తం పథకం అమలుపై తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంబేడ్కర్ అభయ హస్తం పథకానికి నిధులు కేటాయించి లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాల పంపిణీ చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దళిత బంధు 10 లక్షల కంటే 2 లక్షలు ఎక్కువ చేసి 12 లక్షలు అభయ హస్తం పథకంలో ఇస్తామన్న హామీ అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు 33.124 బడ్జెట్‌లో కోట్లు కేటాయించడం స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు బి.ఎస్.రమేష్ మాదిగ, మాల, మాదిగ ఐక్య వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ తిరుపతి, మాదిగ మేధావుల ఫోరం నాయకుడు ప్రొఫెసర్ నతనియల్, నాయకులు నర్సింహరావు, మీసాల మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ అప్‌డేట్ చేయాలి



ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నినాదాలు చేస్తున్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు

కవాడిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మాస్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య నేతలు డాక్టర్ అనంత కృష్ణారావు, మధుసూదన్‌రావు,రోహిణీరావు, ఉప్పు సుధాకర్, మురళీ, సూర్యనారాయణ మూర్తి, సుబ్బారావులు మాట్లాడుతూ, బ్యాంకు వర్కింగ్ ఉద్యోగులతో సమానంగా వారి జీత భత్యాలు పెంచినప్పుడల్లా పెన్షన్ కూడా పెంచాలని వారు డిమాండ్ చేశారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని వారు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, దేనా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియా ఫెడరల్ బ్యాంక్, ఇండియా ఓవర్సీస్ బ్యాంకు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే సతీమణి సరోజ పూజలు



ముషీరాబాద్:అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయంలో శనివారం స్థానిక ఎమ్మెల్యేముఠాగోపాల్ సతీమణి సరోజ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అమీర్‌పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుస్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఆర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీ సమీపంలోని శాలివాహనగర్‌కు చెందిన కోనేర్ అరుణ్‌కుమార్(43) ఈనెల 16న రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఎర్రగడ్డ పిల్లర్ నంబర్ 972 వద్ద అరుణ్‌కుమార్ యూ టర్న్ తీసుకుండగా, సనత్‌నగర్ నుంచి అమీర్‌పేట వైపునకు వస్తున్న అపోలో మెడిషన్‌లో డెలీవరి బాయిగా పనిచేస్తున్న త్రినాథ్ పలమణి ఢీకొట్టాడు. కిందపడిన అరుణ్‌కుమార్ తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు అరుణ్‌కుమార్ సెల్ ఫోన్ నుంచి అతడి కుమారుడు మనోహర ప్రసాద్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కుమారుడు అక్కడి వచ్చి తండ్రిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుమారుడు మనోహర ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బస్తీ దవాఖానా ఉద్యోగులకు వేతనాలు విడుదల

- తెలంగాణ జన సమితి కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆకుల శ్రీనివాస్ తదితరులు

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు 5 నెలల వేతనాలు విడుదల చేయడంలో ప్రస్తుత ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలంగాణ జన సమితి కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆరోపించారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రతి ఉద్యోగికి రూ.10 వేల వేతనం మాత్రమే ఇస్తోందని, రూ.15,600 వేతనం పెరిగి 11 నెలలయినా ఇంతవరకు ఏరియర్స్ చెల్లించలేదని ఆరోపించారు. శనివారం ఎమ్మెల్సీ ఎం.కోదండరాంను కలిసి తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులతో వినతిపత్రం అందజేసిన తర్వాత నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస రావుతో మాట్లాడి 3 నెలల వేతనాలను విడుదల చేయించినట్లు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. మరో రెండు నెలల వేతనాలను నవంబర్ మొదటి వారంలో విడుదల చేస్తామని ఏరియర్స్ ఈఎస్ఐ, పీఎఫ్ నవంబర్ చివరి వారంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ ఒక్కొక్క ఉద్యోగికి రూ.5,600 వేతనం పెరిగినప్పటికీ అవి చెల్లించలేదని ఒక్కొక్క ఉద్యోగికి రావాల్సిన రూ.61 వేల బకాయిలను నవంబర్‌లో అకౌంట్‌లో వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సపోర్టింగ్ స్టాఫ్‌కు దీపావళి బోనస్ విడుదల చేయాలని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు. మూడు నెలల వేతనం విడుదల చేయించినందుకు బస్తీ దవఖానా ఉద్యోగులు ఆకుల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, అంజాద్ అలీఖాన్, కన్వీనర్ ఉప్పలయ్య, సభ్యులు శాంతమ్మ, స్వప్న విజయ, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి క్రీడల్లో బహుమతులు సాధించిన అకాడమిక్ హైట్స్ విద్యార్థులు

జాతీయ స్థాయి క్రీడల్లో ఆడి గెలిచారు

రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించాలని తూర్పు మండలం డీసీపీ బి.బాలస్వామి సూచించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పాఠశాలల పోటీల్లో పాల్గొన్న బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీకి చెందిన అకాడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు పలు క్రీడల్లో గెలిచి ప్రతిభను చాటారు. వీరిని శనివారం డీసీపీ బాలస్వామి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెమెంటోలు అందజేశారు. ఈ పోటీలలో పాఠశాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారు బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ నుంచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా?

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన కార్పొరేటర్



విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవదాస్, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న భోజన వసతి, ఉపాధ్యాయుల కొరతపై వివరాలు సేకరించారు. మధ్యాహ్న భోజనంలో ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా అని అడుగుతూ విద్యార్థులకు కార్పొరేటర్ పావని స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరతను తీర్చేలా భర్తీ చేసేందుకు ప్రభుత్వ అధికారులతో సమీక్షించి త్వరలో ఉపాధ్యాయుల నియామకాన్ని ఏర్పాటు చేయిస్తామని పాఠశాల ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. వాటితోపాటు పాఠశాలలో ఉన్న మరి కొన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పావని తెలిపారు.

ఆరునెలల ఆదాయం 2లక్షల 86వేలు



దోమలగూడ హనుమాన్ దేవాలయంలో హుండీ లెక్కింపు

కవాడిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ హనుమాన్ దేవాలయంలో శనివారం ఆరునెలల హుండీ లెక్కించారు. రూ.2,86,010 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. శనివారం దోమలగూడ హనుమాన్ దేవాలయ భక్తుల సమక్షంలో దేవాదాయ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి సురేఖ, ఆలయ ఈవో దేవనాదం సమక్షంలో ఆలయ అర్చకులు హుండీలు తెరిచి లెక్కించారు. లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.ఆర్‌కె ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, మురళీ కృష్ణ, కె.లక్ష్మీనారాయణ, పరమేష్, కరుణాకర్, శేఖర్, హరికృష్ణ, రవికుమార్, శేషాచార్యులు మహేందర్, లక్ష్మణ్, దేవాదాయ శాఖ అధికారులు భక్తులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పథకాన్ని వినియోగించుకోవాలి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని గాంధీనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్‌లకు చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.3.10 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులకు తప్పకుండా ఈ పథకం కింద నగదు సహాయం అందించేలా కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, విఠల్, ముఠా నరేష్, శ్రీధర్‌చారి, సురేందర్, ఖదీర్, జావీద్, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, చిట్టి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సత్కారం

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ నూతన అధ్యక్షుడుగా నియమితులైన టి.శంకర్ ముదిరాజ్ శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి పూలబోకే అందజేసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహా ఉన్నారు.

ఐద్వా మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఈ నెల 21, 22, 23వ తేదీలలో కొత్తగూడెంలో జరిగే ఐద్వా తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ శనివారం ఐద్వా కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

చైతన్య సేద్యం.. వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ రైతు సంఘం స్వచ్ఛ సేద్యం ఆధ్వర్యంలో ఈ నెల 21న జరిగే చైతన్య సేద్యం - వార్షికోత్సవం ప్రతికూల వాతావరణం, రైతులు, పంట బీమా అనే అంశంపై జరిగే సదస్సు వాల్‌పోస్టర్‌ను శనివారం రైతు సంఘం అధ్యక్షుడు సాగర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మూడ్ శోభన్, రాహుల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి